క్లుప్తంగా...

'నేను నా డిజిటల్ ప్రపంచం' అంశంపై ప్రచారం



జియాగూడ: నేను నా డిజిటల్ ప్రపంచం అనే అంశంపై వారంరోజుల పాటు విస్తృతంగా క్యాంపియన్ ప్రచార కార్యక్రమాన్ని చేపట్టినట్లు రూమ్ టూ రీడ్ మొబిలైజర్స్ అన్నపూర్ణ, శ్రవంతి, యమున తెలిపారు. మంగళవారం మంగళ్‌హాట్ పోలీస్‌స్టేషన్ వద్ద రూమ్ టూ రీడ్ ఆధ్వర్యంలో బాలికా విద్యా కార్యక్రమంలో భాగంగా సైబర్ భద్రత, నేను నా డిజిటల్ ప్రపంచం అనే అంశంపై ప్రచారం చేపట్టారు. ఈ సందర్భంగా మంగళ్‌హాట్ గోషాకత్ ప్రభుత్వ పాఠశాలలోని కమ్యూనిటీలో ప్రజలందరికీ అవగాహన కల్పించారు.

ఉత్సవాలు మతసామరస్యానికి చిహ్నాలు



మీర్ హైదర్ అలీ జాఫ్రీని సన్మానిస్తున్న సయ్యద్ వహీదుద్దీన్ హైదర్ జాఫ్రీ

చార్మినార్: పాతబస్తీలో ఉత్సవాలు మతసామరస్యానికి చిహ్నాలుగా నిలుస్తాయని అంజుమన్-ఇ-అలావీ (అక్బారీ) అధ్యక్షుడు సయ్యద్ వహీదుద్దీన్ హైదర్ జాఫ్రీ అన్నారు. మొహర్రం సంతాప దినాలతో ఇటీవల ముగిసిన మిలాద్-ఉన్-నబీ వేడుకల ముగింపును పురస్కరించుకుని సయ్యద్ వహీదుద్దీన్ హైదర్ జాఫ్రీ ఆధ్వర్యంలో థాంక్స్ ఆఫరింగ్ ఫంక్షన్ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా సహకరించిన వారందరికి ధన్యవాదాలు తెలియజేయడమే కాకుండా ఘనంగా సత్కరించారు. అంజుమన్-ఇ-అలావీ ఉపాధ్యక్షుడు మీర్ హైదర్ అలీ జాఫ్రీ తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ సంస్కృతిని చాటుతున్న బతుకమ్మ వేడుకలు



అబిడ్స్: తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను చాటేందుకు బతుకమ్మ వేడుకలు దోహదపడుతాయని భారతీయ యోగ్ సంస్థాన్ ప్రధాన శిక్షకులు సత్యనారాయణ, లతా సార్దా పేర్కొన్నారు. భారతీయ యోగ్ సంస్థాన్ ఇందిరాపార్కు 2వ సెంటర్ ఆధ్వర్యంలో బతుకమ్మ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. బీవైఎస్ ఆధ్వర్యంలో ఉచితంగా ప్రతిఒక్కరికీ యోగాసనాలు చేయించడంతో పాటు ఆధ్యాత్మిక భావాలను కూడా పెంపొందిస్తామన్నారు. ఆరోగ్యమే మహాభాగ్యమని, ప్రతి ఒక్కరూ ఆరోగ్యకరమైన జీవితం పొందే విధంగా తాము కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో యోగా సభ్యులు శ్రీహరి, సింగ్, రాజేందర్, ఝాన్సీ, స్వరూప, విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

అమ్మవారికి వెండి సింహముఖం అందజేత



గౌలిపురా: గౌలిపురాలోని మహంకాళి మాతేశ్వరి భారతమాత, కోటమైసమ్మ ఆలయంలో దసరా దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా సదానంద్, బీమాచారి, మధుసూదన్ గిరిలు అమ్మవారికి కేజీ వెండితో తయారు చేసిన సింహముఖాన్ని కానుకగా అందజేసి ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అధ్యక్షుడు ఎర్మనీ కైలాష్ గంగపుత్ర, వర్కింగ్ ప్రెసిడెంట్ కె.ఎస్.ఆనంద్ రావు, మల్లేషంగౌడ్, జ్ఞానేశ్వర్ ముదిరాజ్, మధుసూదన్ గిరి, సుమన్‌కుమార్, శ్రీకాంత్, రామకృష్ణ, సాయిబాబా, పోకల్కర్ ప్రకాశ్, జానకీరామ్, రాజు పాల్గొన్నారు.

రూ.7.50 లక్షలు స్వాధీనం

గోల్కొండ: పోలీసులు వాహనాల తనిఖీల్లో రూ.7.50 లక్షలు స్వాధీనం చేసుకున్నారు. గోల్కొండ ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వర్లు తెలిపిన వివరాల ప్రకారం గోల్కొండ పోలీసులు మంగళవారం ఉదయం సెవన్ టూమ్స్ చౌరస్తా వద్ద వాహనాల తనిఖీలు చేస్తున్నారు. అదే సమయంలో ఓ వాహనం టోలిచౌకీ నుంచి సెవన్ టూమ్స్ మీదుగా బంజారా దర్వాజ వైపు వెళ్తుంది. పోలీసులు ఆ కారును ఆపి తనిఖీ చేశారు. ఈ సోదాల్లో వారికి ఆ కారు నుంచి రూ.7.50 లక్షల నగదు పట్టుకున్నారు. ఈ నగదు విషయంపై కారులో ఉన్న వ్యక్తి సరైన ఆధారాలు చూపెట్టలేదు. దీంతో ఈ విషయాన్ని పోలీసులు కార్వాన్ ఆర్వో దృష్టికి తెచ్చి నగదును స్వాధీనం చేసుకున్నారు.

జగన్మాతా పాహిమాం..

దేవీ శరన్నరాత్రి ఉత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. భక్తులు అమ్మవార్లను రోజుకో రూపంలో అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. మంగళవారం పలు ప్రాంతాల్లో కుంకుమార్చనలు చేశారు. భక్తులు పెద్ద సంఖ్యలో అమ్మవార్లను దర్శించుకున్నారు. ఆలయాలు, మండపాల వద్ద నిర్వాహకులు భక్తులకు అన్ని ఏర్పాటు చేశారు. – అబిడ్స్, చార్మినార్, మెహిదీపట్నం జోన్ల బృందం




టోలిచౌకీ అక్బర్‌పురాలో..



జియాగూడ మహంకాళి మాతా అన్నపూర్ణేశ్వరిగా..



ఉప్పుగూడలో గాయత్రీ దేవీ అలంకరణలో అమ్మవారు



మీరాలంమండిలో...



గుడిమల్కాపూర్‌లో మంగళ గౌరీ దేవిగా..



ఎంజే బ్రిడ్జి దరతి మాత ఆలయంలో..



హిందీనగర్ దుర్గామాత ఆలయంలో..



పోచమ్మ ఆలయంలో అన్నపూర్ణాదేవీ రూపంలో...



ఊంజల్ సేవలో సుల్తాన్‌షాహీ జగదాంబ అమ్మవారు



దూద్‌బౌలీలో..కమిటీ ప్రతినిధులు సుంకరి హనుమంత్‌రావు, శేఖర్‌రెడ్డి



బంజారి దర్వాజ అమ్మవారిని దర్శించుకున్న బాబురావు తదితరులు

పేదలకు నాణ్యమైన వైద్య సేవలు

గోల్కొండ: పేదలకు నామమాత్రపు ఫీజులతో అత్యాధునిక వైద్య సేవలు అందిస్తామని ఇండియన్ ముస్లిం రిలీఫ్ అండ్ చారిటీస్ చైర్మన్ మంజూర్‌గౌరీ అన్నారు. మంగళవారం టోలిచౌకీ టూమ్స్ రోడ్‌లో ఆయన ఇండో యూఎస్ ఆస్పత్రిని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇండియన్ ముస్లిం రిలీఫ్ అండ్ ఛారిటీస్ అమెరికా, హైదరాబాద్ సహాయత ట్రస్ట్ ఆధ్వర్యంలో ఈ అత్యాధునిక ఆస్పత్రిని ఏర్పాటు చేయడం జరిగిందని అన్నారు. టోలిచౌకీ, గోల్కొండ, షేక్‌పేట్ తదితర ప్రాంతాల పేద, మధ్య తరగతి ప్రజలు ఆస్పత్రి వైద్య సేవలను ఉపయోగించుకోవచ్చునన్నారు. తమ ఆస్పత్రిలో లెజర్ ట్రీట్‌మెంట్, గైనిక్, ఆర్థోపెడిక్ విభాగాల వైద్యులతో పాటు ఆధునిక



మాట్లాడుతున్న ఐఎంఆర్‌సీ చైర్మన్ మంజూర్‌గౌరీ

పరికరాలతో మూడు ఆపరేషన్ థియేటర్లు కూడా ఉన్నాయన్నారు. ఈ కార్యక్రమంలో ఆస్పత్రి మెడికల్ డైరెక్టర్ డాక్టర్ మోయిజ్, సహాయత ట్రస్ట్ సీఈఓ అనీస్‌ఉద్దీన్‌తో పాటు కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్ మోహియుద్దీన్ తదితరులున్నారు.

సునందకు జాతీయ సేవా రత్న అవార్డు



సేవా రత్న అవార్డు అందుకుంటున్న సునంద

గోల్కొండ: సేవా రంగంలో మహిళలు తమ శక్తిని చాటుకుంటూ మగవారిని అధిగమిస్తున్నారని బహుజన సాహిత్య అకాడమీ జాతీయ అధ్యక్షుడు నల్లా రాధాకృష్ణ అన్నారు. మంగళవారం లంగర్ హౌస్‌కు చెందిన టి.సునందకు ఆయన సేవా రత్న నేషనల్ అవార్డును అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 25 ఏళ్లుగా టి.సునంద పేద తరగతి ప్రజల కోసం ఎంతో నిష్ఠగా పని చేస్తున్నారన్నారు. ముఖ్యంగా మహిళల అభ్యున్నతి కోసం కృషి చేస్తూ ఆమె విజయం సాధిస్తున్నారన్నారు. మాణవీర్‌సింగ్, నేషనల్ కోఆర్డినేటర్ డాక్టర్ ఎం.విజయలలిత, తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ఎంఎం గౌతమ్ తదితరులున్నారు.

గర్బా దాండియా వేడుకలకు సర్వం సిద్ధం

అబిడ్స్: ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లో గర్బా దాండియా వేడుకల నిర్వహణకు దాదాపు ఏర్పాట్లు పూర్తి చేశామని చీఫ్ కన్వీనర్ గోవింద్‌రాఠి, ఎగ్జిబిషన్ సొసైటీ ఉపాధ్యక్షుడు వనం సత్యేందర్, కార్యదర్శి హన్మంతరావు వెల్లడించారు. ఈనెల 18 నుంచి ఐదురోజుల పాటు దాండియా వేడుకలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లో దాండియా వేడుకల నిర్వహణ ఏర్పాట్లను వారు పర్యవేక్షించారు. అనంతరం మాట్లాడుతూ.. ఈనెల 22వ తేదీ వరకు ప్రతిరోజూ రాత్రి దాండియా వేడుకలు నిర్వహిస్తామన్నారు. ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో ఈ సంవత్సరం నిర్వహించే దాండియా వేడుకలకు నగరవాసులే కాక పలు ప్రాంతాల నుంచి పెద్ద ఎత్తున దాండియా ప్రియులు తరలివస్తారని వివరించారు. ఉచి



ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్న నిర్వాహకులు

తంగా పార్కింగ్ సౌకర్యం కల్పిస్తున్నామన్నారు. రాత్రి 12 గంటల వరకు దాండియా వేడుకలు కొనసాగిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో అనిల్ స్వరూప్ మిశ్రా, ఏనుగుల రాజేందర్, మనోజ్ జైస్వాల్, సురేందర్ రెడ్డి, డాక్టర్ వంశీతిలక్, గిరిధర్ లాల్ దాగా తదితరులు పాల్గొన్నారు.

నాయీ బ్రాహ్మణులు అన్ని రంగాల్లో రాణించాలి



ప్రతిభా పురస్కారాలను ప్రదానం చేస్తున్న దృశ్యం

సుల్తాన్‌బజార్: నాయీ బ్రాహ్మణులు అన్ని రంగాల్లో రాణించాలని ప్రముఖ ఆయుర్వేద వైద్యులు డాక్టర్ సూర్యపల్లి సారంగపాణి అన్నారు. నాయీ బ్రాహ్మణ జనసంస్థ 3వ వార్షికోత్సవ సభ మంగళవారం హనుమాన్ టేక్డీలోని బీసీ సాధికారతభవన్‌లో జరిగింది. ఈ సందర్భంగా వివిధ రంగాల్లో ప్రతిభను సాధిస్తున్న నాయీ బ్రాహ్మణులకు ప్రతిభా పురస్కారాలను ముఖ్యఅతిథులు ప్రదానం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. వృత్తినే దైవంగా భావిస్తూ నాయీబ్రాహ్మణులు రాజకీయంగా, ఆర్థికంగా ఎదగాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ పారిశ్రామిక వేత్త రాంబాబు, సినీ హీరో రాంకీ, లింగం నారాయణ, ప్రొఫెసర్ సావిత్రి, చీక టివెలుగు సంపాదకులు సూర్యనారాయణ, సైకాలజిస్ట్ సుధాకర్, నాయీ బ్రాహ్మణ జనసంస్థ గౌరవ సలహాదారులు రాప్రోలు సుదర్శన్, అధ్యక్షుడు శ్రీధర్ మురారి, ఉపాధ్యక్షులు సుశీల్‌కుమార్ సదానందం, శ్రీనివాస్, దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

ఈ-పెట్టీ కేసులో నిందితుడికి 10 రోజుల జైలు

అబిడ్స్: ఓ మహిళ పట్ల అసభ్యంగా ప్రవర్తించిన వ్యక్తికి న్యాయస్థానం 10 రోజుల జైలు శిక్ష విధించింది. అబిడ్స్ ఇన్‌స్పెక్టర్ నర్సింహారాజు తెలిపిన వివరాల ప్రకారం.. గన్‌ఫౌండ్రీలోని ఒక పాఠశాలలో పనిచేసే మహిళ పట్ల అదే పాఠశాలలో పనిచేసే మహ్మద్ దస్తగిరి అసభ్యంగా ప్రవర్తించాడు. ఆ మహిళ ఇచ్చిన ఫిర్యాదు మేరకు అతడిపై ఈ-పెట్టీ కేసును నమోదు చేసి 3వ స్పెషల్ మెట్రోపాలిటన్ మెజిస్ట్రేట్ ముందు హాజరుపరిచారు. న్యాయమూర్తి నిందితుడిగా 10 రోజుల జైలు శిక్ష విధిస్తూ తీర్పునిచ్చింది. కేసు నమోదు చేసిన అబిడ్స్ పోలీసులను ఉన్నతాధికారులు అభినందించారు.

రౌడీయిజం చేస్తే ఉక్కుపాదంతో అణచివేస్తాం



రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న డీసీపీ సాయి చైతన్య

చాంద్రాయణగుట్ట: రౌడీయిజం చేస్తే ఉక్కుపాదంతో అణచివేస్తామని దక్షిణ మండలం డీసీపీ సాయి చైతన్య హెచ్చరించారు. ఛత్రినాక డివిజన్‌లోని ఛత్రినాక, శాలిబండ, మొఘల్‌పురా పోలీస్‌స్టేషన్లకు చెందిన దాదాపు 100 మంది రౌడీషీటర్లకు మంగళవారం ఆయన అదనపు డీసీపీ షేక్ జహంగీర్‌తో కలిసి కౌన్సెలింగ్ నిర్వహించారు. అసెంబ్లీ ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు పోలీస్ శాఖ తరఫున అన్ని రకాల చర్యలు తీసుకుంటున్నామన్నారు. రౌడీషీటర్లు పనిచేసే ప్రాంతాల వద్ద కూడా నిఘా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో ఛత్రినాక డివిజన్ ఏసీపీ జి.రమేష్, ఇన్‌స్పెక్టర్లు భోజ్యానాయక్, రమేష్, శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రౌడీషీటర్లకు కౌన్సెలింగ్

డబీర్‌పురా: ఎన్నికల సమయంలో రౌడీషీటర్లు అనవసరమైన గొడవల్లో పాల్గొని శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే చట్టరీత్యా తీసుకుంటామని డబీర్‌పురా ఇన్‌స్పెక్టర్ కోటేశ్వర్‌రావు సూచించారు. డబీర్‌పురా పోలీస్‌స్టేషన్ పరిధిలోని రౌడీషీటర్లు అయిన అబ్దుల్ ఖదీర్, అబ్దుల్ సమి, సయ్యద్ కమ్రాన్, మహ్మద్ సల్మాన్, మహ్మద్ సైఫ్ మంగళవారం ఆయన స్టేషన్‌లో కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎట్టి పరిస్థితుల్లో ఎన్నిక సమయంలో అసాంఘిక కార్యకలాపాలతో పాటు నేరాలకు పాల్పడకూదన్నారు. ఇప్పటికే రౌడీషీటర్లుగా నమోదైన వారందరూ సత్ప్రవర్తనతో సమాజంలో జీవించాలని ఆయన రౌడీషీటర్లకు సూచించారు. రౌడీషీటర్ల కదలికలను తమ సిబ్బంది ఎప్పటికప్పుడు పసి గడుతుందన్నారు.

మహిళల అభ్యున్నతికి కృషి

జంగ్ 2023 తెలంగాణ

గోల్కొండ: మహిళల అభ్యున్నతికి కృషి చేస్తున్నామని ఎమ్మెల్యే కౌసర్ మోహియుద్దీన్ అన్నారు. మంగళవారం టోలిచౌకీ అల్ఫాగార్డెన్ ఫంక్షన్‌హాల్‌లో మహిళా పొదుపు సంఘాల సభ్యులు నిర్వాహకుల సమావేశం జరిగింది. ఆయన మాట్లాడుతూ.. మహిళా పొదుపు సంఘాలతో పాటు చదువుకున్న యువతులకు స్వయం ఉపాధి కోసం కూడా వివిధ ఆర్థిక సంస్థల నుంచి సబ్సిడీలపై రుణాలు ఇప్పించడం జరిగిందన్నారు. ప్రస్తుతం కార్వాన్ నియోజకవర్గంలో వందలాది మహిళా పొదుపు సంఘాల గ్రూప్‌లు క్రియాశీలకంగా ఉన్నాయని అన్నారు. ముస్లిం మహిళలు పొదుపు సంఘాల గ్రూప్‌లు ఏర్పాటు చేయడంలో ఇంకా



మాట్లాడుతున్న కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్

వెనుకబడి ఉన్నారని ఆయన పేర్కొన్నారు. తమ కుటుంబ సభ్యులను పొదుపు సంఘాల ప్రయోజనాలను వివరించాలని, పొదుపు సంఘం ఏర్పాటుతో కలిగే ఆర్థిక ప్రయోజనాలు కూడా వివరించాలని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో నానల్‌నగర్ కార్పొరేటర్ మహ్మద్ నసీరుద్దీన్, మజ్లిస్ టోలిచౌకీ అధ్యక్షుడు హారూన్‌ఫరాన్, బద్దరుద్దీన్, వజీఉజ్జమ తదితరులున్నారు.

గోషామహల్ కాంగ్రెస్ టికెట్ స్థానికులకే ఇవ్వాలి



మాట్లాడుతున్న వినయ్‌కుమార్ ముదిరాజ్

అబిడ్స్: గోషామహల్ కాంగ్రెస్ టికెట్‌ను స్థానికులకే ఇస్తే టికెట్ కోసం పోటీపడినవారంతా పని చేసి పార్టీని గెలిపిస్తామని రాష్ట్ర యువజన కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు వినయ్‌కుమార్ ముదిరాజ్, సీనియర్ కాంగ్రెస్ నాయకుడు కన్నయ్యలాల్ సాహు పేర్కొన్నారు. ఖైరతాబాద్ నియోజకవర్గానికి చెందిన సునితరావుకు పార్టీ టికెట్ ఎలా కేటాయిస్తారని వారంతా భగ్గుమన్నారు. మంగళవారం మంగళ్‌హాట్ గోడేకికబర్ షాహినాయత్‌గంజ్ ప్రాంతంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో కాంగ్రెస్ టికెట్ కోసం పోటీపడిన స్థానిక నాయకులు సంజయ్‌కుమార్‌యాదవ్, సుధీర్‌కుమార్ తివారి (గుల్లు మహారాజ్), సీకే మూర్తి, శ్రీధర్‌గౌడ్, నర్మద సింగ్, రణవీర్ ఠాకూర్, సునిల్ కుమార్, నిర్మల్‌కుమార్ యాదవ్‌తో కలిసి ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ పటిష్టంగా ఉందని తామంతా తమలో ఎవరి టికెటు ఇచ్చినా అందరం కలిసికట్టుగా పనిచేసి పార్టీని గెలిపిస్తామన్నారు. సునితారావు టికెట్ మార్చనిచో తామంతా పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డిని సైతం గోషామహల్‌కు వస్తే అడ్డుకుంటామని హెచ్చరించారు. గోషామహల్ కాంగ్రెస్ పార్టీ సర్వే చేసి టికెట్ ఇస్తే బాగుంటుందని వారు పేర్కొన్నారు. గతంలో ఒక పర్యాయం ఎమ్మెల్యేగా, నగర మేయర్‌గా తన తండ్రి లక్ష్మీనారాయణ ముదిరాజ్ పనిచేశారని, తన కుటుంబం 50 ఏళ్లుగా కాంగ్రెస్ పార్టీలో ఉందని, అలాంటి తనకు టికెట్ ఇవ్వకపోవడం దారుణమని టికెట్ కోసం తీవ్రంగా ప్రయత్నించిన వినయ్‌కుమార్ ముదిరాజ్ పేర్కొన్నారు.

వివరాలు లేని నగదును తరలిస్తే కేసులు నమోదు చేస్తాం

అబిడ్స్: ఎలాంటి వివరాలు లేకుండా ఎన్నికల నిబంధనలు ఉల్లంఘించి భారీ ఎత్తున నగదును వాహనాల్లో తరలిస్తే కేసులు నమోదు చేస్తామని అబిడ్స్ డివిజన్ ఏసీపీ ఆకుల చంద్రశేఖర్ హెచ్చరించారు. ఎన్నికల నిబంధనలు అమలులో ఉన్నాయన్నారు. ప్రతి ఒక్క వాహనదారుడు వివరాలతో కూడిన నగదును తమ వద్ద ఉంచుకోవాలన్నారు. రూ.50 వేలకు పై అధికంగా ఉంటే వివరాలు లేనిచో కేసులు నమోదు చేస్తామన్నారు. బేగంబజార్ పోలీస్‌స్టేషన్ పరిధిలో పలు ప్రాంతాల్లో తనిఖీలు చేసి ఐదుగురు వ్యక్తుల వద్ద రూ.21,94,560 లక్షల నగదును సీజ్ చేశామన్నారు. ఐదుగురు వ్యక్తులపై కేసులు నమోదు చేశామన్నారు. ఈ



సమావేశంలో ఏసీపీ చంద్రశేఖర్, ఇన్‌స్పెక్టర్ శంకర్

కేసులను ఇన్‌స్పెక్టర్ శంకర్ ఆధ్వర్యంలో కేసులు దర్యాప్తు చేస్తున్నామన్నారు.

కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం ఖాయం



రేవంత్‌రెడ్డి సమక్షంలో పార్టీలో చేర్పిస్తున్న కాంగ్రెస్ నాయకుడు షాహబాజ్ ఖాన్

శాలిబండ: రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం ఖాయమని కాంగ్రెస్ పార్టీ నాయకుడు, చార్మినార్ నియోజకవర్గం నుంచి టికెట్ ఆశిస్తున్న షాహబాజ్ ఖాన్ అన్నారు. మంగళవారం చార్మినార్ నియోజకవర్గం నుంచి 200 మంది నాయకులను గాంధీభవన్‌లో టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేర్పించారు. కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన ఆరు గ్యారంటీ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి పార్టీ విజయానికి కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో షేక్ అబ్దుల్లా, సోహేల్, మీర్ అసద్ అలీ, మహ్మద్ ఆమేర్, మహ్మద్ జుబేర్ తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణలో బహుజన రాజ్యం రావాలి

గన్‌ఫౌండ్రీ: తెలంగాణ రాష్ట్రంలో బహుజన రాజ్యం రావాలని భారతీయ రిపబ్లికన్ పార్టీ జాతీయ అధ్యక్షుడు డాక్టర్ అంబేడ్కర్ యశ్వంత్ రావు అన్నారు. మంగళవారం బషీర్‌బాగ్‌లోని కార్యాలయంలో తెలంగాణ రాష్ట్ర నూతన అధ్యక్షుడిగా ఏవీ వెంకటస్వామిని నియమించారు. ఈ సందర్భంగా ఆయనకు నియామకపత్రాన్ని అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. రాబోయే ఎన్నికల్లో బహుజనలు తమ ఓటును అమ్ముకోవద్దని, మన అభివృద్ధి కోసం మనమే ఓటు వేసుకోవాలని సూచించారు. రాష్ట్ర అధ్యక్షుడు ఏవీ వెంకటస్వామి మాట్లాడుతూ.. తనపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించిన జాతీయ నాయకత్వానికి కృతజ్ఞతలు



వెంకటస్వామిని సన్మానిస్తున్న పలువురు నాయకులు

తెలిపారు. ఈ సమావేశంలో మేజర్ చంద్రకాంత్, మల్లెల జీవన్ పార్టీ నాయకులు సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణలో బీజేపీ బలోపేతం



కార్యక్రమంలో పాల్గొన్న బీజేపీ నాయకులు దేవర శ్రీనివాస్, మాణిక్‌ప్రభు తదితరులు

గోల్కొండ: రాష్ట్రంలో బీజేపీ బలోపేతంగా ఉందని అసెంబ్లీ ఎన్నికల్లో పాలక బీఆర్ఎస్‌ను బీజేపీ ఓడించడం ఖాయమని బీజేపీ నాయకులు రావుల మాణిక్‌ప్రభు, దేవర శ్రీనివాస్ అన్నారు. కార్వాన్ ఎస్‌డీఏ గార్డెన్‌లో బీజేపీ కార్యకర్తల విస్తారక్ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో కిసాన్ మోర్చా నాయకుడు రావుల మాణిక్‌ప్రభుతో పాటు బీజేపీ నాయకులు దేవర శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకుల దుర్మరణం

మక్తల్: రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకుల మృతి చెందిన ఘటన నారాయణపేట జిల్లా గుడిగండ్లలో మంగళవారం ఉదయం చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. హైదరాబాద్ గౌలిగూడకు చెందిన ఉదయ్‌కుమార్(28) ఓ ఇంజినీరింగ్ కళాశాలలో మూడో సంవత్సరం చదువుతున్నాడు. ఇతనికి అంబర్‌పేటకు చెందిన అఖిల్ (26)తో పరిచయం ఏర్పడింది. అఖిల్ ఐటీఐ ఫెయిల్ అయ్యి ఖాళీగా ఉంటున్నాడు. సోమవారం రాత్రి ఉదయ్‌కుమార్, అఖిల్ ఇద్దరు కలిసి ఇంట్లో ఎవరికీ చెప్పకుండా స్కూటీపై హైదరాబాద్ నుంచి బయలుదేరి మక్తల్ వైపు వస్తున్నారు. ఈ క్రమంలో మండలంలోని గుడిగండ్ల దగ్గర రాయచూర్ నుంచి మహబూబ్‌నగర్ వెళ్తున్న కర్ణాటక బస్సు ఎదురుగా వస్తున్న స్కూటీని ఢీకొట్టడంతో ఉదయ్‌కుమార్ అక్కడికక్కడే మృతిచెందగా.. అఖిల్ తీవ్రంగా గాయపడ్డాడు. గమనించిన స్థానికులు వెంటనే 108లో అఖిల్‌ను మహబూబ్‌నగర్ జనరల్ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. అనంతరం సమాచారం అందుకున్న ఎస్ఐ పర్వతాలు సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకుని ఉదయ్‌కుమార్ మృతదేహాన్ని మక్తల్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనపై అఖిల్ తల్లి ఉమ, ఉదయ్‌కుమార్ తండ్రి మహేందర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.